క్లుప్తంగా...

బండి సంజయ్‌కి సన్మానం



గోల్కొండ: అక్రమ కేసులు, అరెస్టులకు బీజేపీ నాయకులు భయపడరని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. అమెరికా పర్యటన ముగించుకొని నగరానికి వచ్చిన బండి సంజయ్‌ని గుడిమల్కాపూర్ బీజేపీ నాయకులు గురువారం కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సి.ఉదయ్ కుమార్, నాయకులు దేవర వంశీ ఉన్నారు.

భార్యాభర్తలకు నిరంతర అవగాహన



శ్రీనివాసరావు

అబిడ్స్: మహిళా పోలీస్‌స్టేషన్‌కు వచ్చే భార్యాభర్తలకు నిరంతరం అవగాహన కల్పించి సఖ్యతతో ఉండే విధంగా కృషి చేస్తున్నట్లు సౌత్‌వెస్ట్ జోన్ మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. షాహినాయత్‌గంజ్ పాత పోలీస్‌స్టేషన్ భవన్‌లో ఇటీవల సౌత్ వెస్ట్ మహిళా పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కుటుంబాలలో చిన్న చిన్న విషయాలకు అవగాహన లేమితో పట్టింపులకు పోయి విభేదాలు సృష్టించుకుంటున్నారన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసే వారికి ముందుగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. భార్యాభర్తలు కలిసి ఉండే విధంగా వారి పిల్లలు, కుటుంబ సభ్యులు అందరూ సంతోషంగా ఉండే విధంగా కృషి చేస్తున్నామన్నారు.

గణేష్ ఉత్సవాల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు

అబిడ్స్: గణేష్ ఉత్సవాల్లో మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మండపాల నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ రాత్రి నిర్వాహకులు మండపాలలోనే నిద్రించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

సెప్టెంబర్ 17 వేడుకల ప్రాంగణంలోకి వరద నీరు



వర్షంతో తడిసిన కార్పెట్లను సురక్షిత ప్రాంతానికి చేర్చుతున్న సిబ్బంది

నాంపల్లి: సెప్టెంబర్ 17 వేడుకలకు పబ్లిక్‌గార్డెన్స్‌లో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో తీవ్ర అంతరాయం కలిగింది. భారీగా కురిసిన వర్షానికి పబ్లిక్‌గార్డెన్స్ పూర్తిగా నీట మునిగింది. ఏర్పాట్లలో భాగంగా సిద్ధం చేసిన ఎలక్ట్రానిక్ పరికరాలు తడిసి ముద్దయ్యాయి. విద్యుత్ వెలుగుల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. స్పీకర్లు, వైర్లు, బ్యాటరీలు, కార్పెట్లు తదితర పరికరాలను సమీపంలోని బాలభవన్ ప్రాంగణంలోకి చేర్చారు. ఈ వేడుకలకు సీఎం కేసీఆర్ హాజరై జెండా వందనం చేయనున్న నేపథ్యంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది దగ్గరుండి ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. పోలీసు అధికారులు దగ్గరుండి భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఏర్పాట్లు పూర్తి కావడానికి మరో రెండు రోజులే మిగిలి ఉంది. గురువారం సాయంత్రానికి 25 శాతం పనులు కూడా పూర్తికాలేదు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



అనిల్‌కుమార్

విజయనగర్‌కాలనీ: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన గురువారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..బీహార్ దర్బంగ జిల్లా గ్రామానికి చెందిన శివేశ్వర్ దాస్ నగరానికి 30 ఏళ్ల క్రితం వచ్చి స్కూల్‌బ్యాగ్‌లు తయారు చేస్తూ జీవిస్తున్నారు. ఇతడికి ఇద్దర కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరిలో 2వ కుమారుడు అనిల్‌కుమార్ దాస్(25) గత ఏడాది క్రితం వివాహం అయ్యింది. తండ్రి స్కూల్‌బ్యాగ్‌ల తయారీలో అనిల్‌కుమార్ దాస్ కూడా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం స్కూల్‌బ్యాగ్‌లు కుట్టే కుట్టుమిషన్‌కు అనుసంధించి ఉన్న విద్యుత్ మోటార్‌కు కరెంటు వైరు తెగిపోయింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో విద్యుత్ వైరు జాయింట్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలిఘటన స్థలంలోనే స్పృహ కోల్పోయాడు. కుటుంబ సభ్యులు అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అనిల్‌కుమార్ దాస్ మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



అహ్మద్ కాలనీలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన గోల్కొండ, లంగర్‌హౌజ్, టోలిచౌకి డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బాగ్దాద్‌కాలనీ, కంపెనీ బాగ్, ఎండీ లైన్స్, టోలిచౌకి నిజాంకాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి స్థానికులను కలుసుకున్నారు. మజ్లిస్ పార్టీ ఎప్పుడు ప్రజల వెంటే ఉంటుందని తమ పార్టీ ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటుందని ఆయన అన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను జాబితాగా తయారు చేసుకోని వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. విడతల వారీగా అధికారులకు సమస్యలు వివరించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆయన బాగ్దాద్‌కాలనీ, కంపెనీబాగ్, ఎండీలైన్స్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. భారీ పైప్‌లైన్ పనులు సుదీర్ఘకాలంగా జరుగుతున్నాయని ఎండీ లైన్స్ వాసులు ఆయన దృష్టికి తెచ్చారు. వేగంగా ఆ పనులు పూర్తి చేయాలని ఆయన అక్కడ ఉన్న కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం కంపెనీ బాగ్ వద్ద జరుగుతున్న డ్రైనేజీ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు.

వినాయక మండప నిర్మాణానికి కర్ర పూజ



మండప నిర్మాణానికి కర్ర పూజ నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర

గౌలిపురా: గౌలిపురా మార్కెట్‌లో గౌలిపురా గణేష్ ఉత్సవ సమితి భాగ్యనగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వినాయక మండపానికి మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర గురువారం కర్ర పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఈసారి కలకత్తా కళాకారులతో శ్రీరాముడి రూపంలో మండపం నిర్మాణం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్, శ్రీ మహంకాళి మాతేశ్వరి ఆలయ అధ్యక్షులు ఎర్మని కైలాష్ గంగపుత్ర, అల్లి మధుసూదన్ గిరి, సీహెచ్.రూప్ రాజ్, మోకాళ్ల వెంకటేష్, జి.రఘుకాంత్, ఎ.మహేందర్ గిరి, మామిడి కృష్ణ, కె.రాజ్ కుమార్, జమాల్‌పూర్ అశోక్, కొడి సురేందర్, జె.చిరంజీవి పాల్గొన్నారు.

వినాయక నవరాత్రులను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీసీపీ కిరణ్ ఖారే

విజయనగర్‌కాలనీ: రాబోయే పర్వదినాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే అన్నారు. గురువారం సాయంత్రం ఆసిఫ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వినాయక నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణపతి నవరాత్రులను మండప నిర్వాహకులు, భక్తులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి గణపతి నవరాత్రుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సౌత్‌వెస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ అశ్వక్, ఆసిఫ్‌నగర్, గోషామహల్, గోల్కొండ, కుల్సుంపురా ఏసీపీలతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, జీహెచ్‌ఎంసీ, ఎలక్ట్రిసిటీ, ఫైర్, ఆర్‌అండ్‌బీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



దీక్షకు మద్దతు తెలిపిన జియాగూడ మాదిగ సేవా సంఘం అధ్యక్షుడు రాములు

జియాగూడ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం బీజేపీ నైతిక బాధ్యత అని జియాగూడ మాదిగ సేవా సంఘం అధ్యక్షుడు (నర్సింహ) అన్నారు. గురువారం ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కార్వాన్ నియోజకవర్గం ఎంఎస్‌పీ ఇన్‌చార్జ్ మిరియాల నవీన్ మాదిగ, కో ఇన్‌చార్జ్ మ్యాతరి చంద్రమోహన్ మాదిగ ఆధ్వర్యంలో జాతీయ రహదారిలో మహా దీక్షను చేపట్టారు. ఈనెల 18 నుంచి 22 వరకు కొనసాగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని వారు డిమాండ్ చేస్తూ 10 రోజుల పాటు దీక్ష కొనసాగిస్తున్నారు. 3వ రోజున జియాగూడ మాదిగ సేవా సంఘం చుడిబజార్ అరుంధతి సేవా సంఘం ప్రతినిధులు తమ సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బి.మణ్యం మాదిగ, పి.చెన్నయ్య మాదిగ, ఎం.ఆశయ్య మాదిగ, గోపీస్వామి, జి.నరేందర్, ఎం.మహేష్, జి.రాంచందర్, నర్సింహా, ఆంజనేయులు, యాదగిరి, చుడిబజార్ సంఘం ప్రధాన కార్యదర్శి మ్యాతరి ధర్మేదర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగేశ్వర్, జియాగూడ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సి.బాబు, వి.అరుణ్, శివరాజ్ సింగ్ పాల్గొన్నారు.

పౌర సరఫరాల ప్రక్రియపై రాష్ట్ర స్థాయి సదస్సు



నాంపల్లి: పౌర సరఫరాల ప్రక్రియల సామర్థ్యాన్ని మెరుగుపరిచే మార్గాలపై చర్చించేందుకు ప్రభుత్వ అధికారులు, నిపుణులు గురువారం హాకా భవన్‌లో సమావేశమయ్యారు. రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.కేశవరావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జనరల్ మేనేజరు జి.ఎస్.రాజు, జస్టిస్ డి.ఎస్.ఆర్.వర్మ, రిజ్వాన్ మహ్మద్, సత్యమూర్తి శివలెంక, పుల్లం తిరుపతి, బూర సురేంద్రగౌడ్, చిలకలపూడి సీతారామారావు బొల్లేపల్లి విజేందర్‌రెడ్డి, వినోద్ కృష్ణ చైతన్య, ఎస్.వి. గౌతమ్ తదితరులు హాజరయ్యారు. సకాలంలో ప్రజా పంపిణీ జరిగే అంశాలు, ఆహార ఉత్పత్తుల సరఫరా గొలుసును ఆప్టిమైజ్ చేయడంపై దృష్టిసారించి ఎఫ్‌సీఐ, పౌర సరఫరాల విధానాల్లో మెరుగుదల అవకాశాలను సుదీర్ఘంగా చర్చించారు. పౌర సరఫరాల కార్యకలాపాలను మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలను కొన్నింటిని వారు సిఫార్సు చేశారు. నిపుణులు సూచించిన సూచనలు దేశ ప్రయోజనాలను మెరుగుపరిచేందుకు దోహదపడుతాయని అభిప్రాయపడ్డారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్ పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, ఆచార్య తంగెడ కిషన్ రావు

నాంపల్లి: తెలంగాణ ఉద్యమంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ పాత్ర సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ విషయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, విశ్వనాథ సాహిత్యపీఠం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అధ్యక్షతన జరిగిన సభకు సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, ప్రఖ్యాత సినిమా దర్శకులు బి.నరసింగరావు, తెలుగు అకాడమీ పూర్వ సంచాలకులు ఆచార్య కె.యాదగిరి, సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కోయి కోటేశ్వరరావు, మహాబోధి పాఠశాల కార్యదర్శి వెన్నెల హాజరయ్యారు. విశ్వనాథ సాహిత పీఠం అధ్యక్షుడు డాక్ట్ వెలిచాల కొండలరావు హాజరై సభను ప్రారంభించారు.

ఘనంగా హిందీ దివస్ వేడుకలు



ఉపాధ్యాయులను, విద్యార్థులను సత్కరించిన ప్రేమలత అగర్వాల్, జితేందర్ సింగ్

అబిడ్స్: ధూల్‌పేట్‌లోని రిలయన్స్ హైటెక్ స్కూల్‌లో హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ లింగూయిస్టిక్స్ మైనార్టీ సెల్ చైర్‌పర్సన్ ప్రేమ్‌లత అగర్వాల్ ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయులు, విద్యార్థులను సన్మానించారు. వారికి మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హిందీ భాషాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ వేడుకల్లో రిలయన్స్ హైటెక్ స్కూల్ డైరెక్టర్ జితేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత

డబీర్‌పురా: ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ తన బ్యాగ్‌ను పోగొట్టుకోవడంతో మీర్‌చౌక్ పోలీసులు ఆటోను గుర్తించి మహిళకు గురువారం బ్యాగ్‌ను అందజేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. అంబర్‌పేట్ మారుతినగర్‌కు చెందిన ఓ మహిళ తన తల్లితో కలిసి గురువారం ఆటోలో ఎంజీబీఎస్ బస్టాండ్ వరకు చేరుకుంది. అనంతరం దిగి చూసే సరికి తన వద్ద ఉన్న బ్యాగ్ కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన మహిళ 16 తులాల బంగారం, ఇతర వస్తువులతో కూడిన బ్యాగ్ కనిపించకుండా పోయిందని మీర్‌చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మీర్‌చౌక్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా మహిళా ప్రయాణించిన ఆటోను గుర్తించి అందులో ఉన్న బ్యాగ్‌ను మహిళకు అందజేశారు. పోగొట్టుకున్న బ్యాగ్‌ను వెంటనే అందించినందుకు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

‘డబుల్’ ఇళ్ల విచారణ వేగవంతంగా చేపట్టండి



ఆర్డీఓ సూర్యప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: ‘డబుల్’ఇళ్ల విచారణ వేగవంతంగా చేపట్టాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. హైదరాబాద్ ఆర్డీఓ సూర్యప్రకాష్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. డబుల్‌బెడ్‌రూమ్‌లతో పాటు షాదీముబారక్, కల్యాణలక్ష్మి, క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్లను ప్రజలకు త్వరితగతిన ఇచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వేగవంతంగా అందించేందుకు కృషి చేస్తామన్నారు. అన్ని పథకాలు మండల సిబ్బంది, అధికారులు త్వరితగతిన అర్హులైన వారికి అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నందు కుమార్, వనిత, డాలి, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరికి ఏడాది జైలు

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో పక్కింటి వారిపై దాడి చేసిన ఇద్దరు అన్నదమ్ములకు న్యాయస్థానం ఏడాది జైలు శిక్షను విధించింది. పోలీసుల వివరాల ప్రకారం..లలితాబాగ్ భయ్యాలాల్‌నగర్‌కు చెందిన డి.గణేష్(28), లక్ష్మణ్‌పై 2019 డిసెంబర్ 18న పక్కింటికి చెందిన అన్నదమ్ములు జి.దేవేందర్(20), జి.నరేందర్(20) అకారణంగా ఇనుపరాడ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నాంపల్లి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి దుర్గాప్రసాద్ ఇద్దరు అన్నదమ్ములకు ఏడాది పాటు జైలు శిక్షను విధిస్తూ తీర్పును వెల్లడించారు.

ధూల్‌పేట పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

జియాగూడ: ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు ధూల్‌పేట పరిసరాల్లో వినాయక విగ్రహాలను తరలించడానికి పలు రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలను విధించినట్లు హైదరాబాద్ జిల్లా ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. ఆయన గురువారం ఒక ప్రకటనలో ట్రాఫిక్ ఆంక్షలను వెల్లడించారు. 15న ఉదయం 7 నుంచి 18వ తేదీ రాత్రి 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు.

ప్రవేశం..

- రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు గణేష్ విగ్రహాలను కొనుగోలు చేసిన రశీదు చూపించిన భారీ వాహనాలకు గాంధీ విగ్రహం నుంచి ప్రవేశం ఉంటుందన్నారు.
- టక్కెరవాడి నుంచి గోడేకబర్ కూడా ఇదే వర్తిస్తుందన్నారు.

బయటకు వెళ్లే దారి..

- బోయిగూడ కమాన్ ద్వారా అన్ని వాహనాలు బయటకు పంపించడం జరుగుతుందని వయా దారుసలాం, ఏక్‌మినార్, గోషామహల్ అలస్కా పెట్రోల్ పంప్ టీ జంక్షన్, ఎంజేమార్కెట్, ఛత్రి, భూలక్ష్మమ్మ గుడి మీదుగా అఫ్జల్‌గంజ్, పురానాపూల్, బహదూర్‌పురా మీదుగా విగ్రహాలను తరలించడం జరుగుతుంది.
- ఆగాపురా సిండికేట్ బ్యాంక్ మీదుగా కూడా విగ్రహాలను భారీ వాహనాలలో తరలించడం జరుగుతుంది.
- టప్పాచబుత్ర జిర్రా వాహనాలను కార్వాన్, లంగర్‌హౌస్, ఆసిఫ్‌నగర్ రూట్లలో పంపిస్తారు.
- ఏ వెహికిల్‌ను కూడా ధూల్‌పేట్, గణేష్ విగ్రహాల మార్కెట్‌కు అనుమతి లేదని తెలిపారు.
- ధూల్‌పేట్ గణేష్ విగ్రహాల మార్కెట్‌కు చిన్న వాహనాలను ఎప్పుడైనా పంపిస్తారని ప్రవేశ దారిగుండా అనుమతి ఉంటుందని తెలిపారు.

పార్కింగ్ స్థలాలు..

- గణేష్ విగ్రహాల నిర్వాహకులు తమ భారీ వాహనాలను జుమ్మెరాత్‌బజార్ గ్రౌండ్‌లో నిలపాలన్నారు.
- అలాగే గణేష్ మండప నిర్వాహకులు కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని 100 ఫీట్ల రహదారిలో భారీ వాహనాలను నిలపాలన్నారు.
- ముస్లింజంగ్ నుంచి పురానాపూల్ వరకు ఆర్టీసీ బస్సులకు అనుమతి లేదు.
- భారీ వాహనాల డ్రైవర్లు తమ వాహనాలను కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలన్నారు. వాహనాల డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ విధానాలను, రూట్లను పాటించాలని తెలిపారు.

వైద్యులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి హరీశ్‌రావు కార్యాలయంలో సమ్మె నోటీసు ఇస్తున్న జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న వైద్యులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ డాక్టర్ వినయ్‌కుమార్, కో చైర్మన్ రాహులు, కన్వీనర్ మల్లయ్య నేతృత్వంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కార్యాలయంలో సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏపీలో మాదిరిగా తెలంగాణలో వైద్య విధాన పరిషత్‌ను వెంటనే రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరి హెల్త్ సర్వీస్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. అలాగే ట్రెజరి ద్వారా జీతాలు చెల్లించాలని, మెడికల్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ అయిన వైద్య విధాన పరిషత్ వైద్యశాలల్లోని ప్రమోషన్ పోస్టులను యధావిధిగా ఉంచి ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు సత్యనారాయణరెడ్డి, కరుణాకర్, మధుసుధన్‌రెడ్డి, అమృత్‌రావు, స్వర్ణలత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పండగలను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్‌కరే

గోల్కొండ: పండగలను శాంతియుతంగా జరుపుకోవాలని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ కిరణ్‌కరే అన్నారు. గురువారం మెహిదీపట్నం ఎంపీ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని వినయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండగల ఏర్పాట్లపై మాట్లాడారు. మండపాల ఏర్పాట్లు, ఉత్సవాల వేదికల ఏర్పాట్లు మిలాద్ ఉన్ నబీ ర్యాలీల నిర్వాహకులు పోలీసుల సలహాలు, సూచనలను దృష్టిలో పెట్టుకోవాలని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం పోలీసులు అమలు చేస్తున్న ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ ఎండీ అష్ఫాక్, సౌత్ వెస్ట్ జోన్ ఏసీపీలు ఎండీ జావిద్, సయ్యద్ ఫయాజ్, రాజా వెంకట్‌రెడ్డి, కోట్ల వెంకట్‌రెడ్డి, పీస్ అండ్ మైత్రి కమిటి అధ్యక్షుడు యాసిన్‌ఆలీబేగ్, ఆరీఫ్‌హుస్సేన్, అస్ఫాక్‌అహ్మద్, సులేమాన్‌ఖాన్, సర్దార్‌ఖాన్ తదితరులున్నారు.

అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు

గౌలిపురా: గౌలిపురా బతుకమ్మ బావి వద్దనున్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో గురువారం శ్రావణ అమావాస్యను పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా ఆధ్వర్యంలో పరమశివునికి విశేష పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు సరాబు లక్ష్మణ్ గుప్తా, చైర్మన్ శ్రీరాం కోటయ్య గుప్తా, లాల్‌దర్వాజా సంఘం అధ్యక్షులు శ్రీధర మల్లికార్జున్ గుప్తా, కాశి రామేశ్వరం ఆర్యవైశ్య వాసవీ నిత్యాన్న సత్రం ట్రస్టు అధ్యక్షులు కొమురవెల్లి దుర్గా ప్రసాద్ రావు, కోశాధికారి గుండా లక్ష్మీకాంత రావు, సరాబు విశ్వేశ్వరయ్య గుప్తా, ప్రధాన కార్యదర్శి సరాబు సంతోష్ గుప్తా పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయభేరి సభకు తరలిరావాలి

చార్మినార్: తుక్కుగూడలో ఈనెల 17న కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న విజయభేరి సభకు కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ పిలుపునిచ్చారు. గురువారం చార్మినార్ సమీపంలోని ఆలిజాకోట్లా వద్ద సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ మూసా ఖాసిం అధ్యక్షతన ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభకు పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖార్గే తదితర ప్రముఖులు వస్తున్నారన్నారు. సయ్యద్ ముజాహీద్ షా, సయ్యద్ ఇక్బాల్, తిరుపతి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

రెరా చట్టంపై అపోహలు వీడాలి



గన్‌ఫౌండ్రీ: రెరా చట్టంపై అపోహలు వీడాలని తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) చైర్మన్ డాక్టర్ ఎస్.సత్యనారయణ సూచించారు. గురువారం అబిడ్స్‌లోని రాయల్‌టన్ హోటల్‌లో యునిక్ రియాలటీ సంస్థ ఆధ్వర్యంలో రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ ఉద్యోగులకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాపును ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రెరా చట్టం ప్రకారం అన్ని కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర నరేడ్కో అధ్యక్షుడు బి.సునీల్ చంద్రరెడ్డి మాట్లాడుతూ..రియల్‌ఎస్టేట్ అభివృద్ధిలో ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని, ఆ రంగంలో విజయం సాధించాలంటే ఎలా అనే విషయంపై సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ నగర అధ్యక్షులు రామకృష్ణ రావు, సంస్థ వ్యవస్థాపకులు సుశీల్ కుమార్, సహా వ్యవస్థాపకులు వేణు కల్యాణ్‌లతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన 220 మంది రియల్‌ఎస్టేట్ ఏజెంట్లు పాల్గొన్నారు.

జంట ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు




సమావేశంలో డీసీపీ సాయి చైతన్య తదితరులు

చార్మినార్: జంట ఉత్సవాలు ప్రశాంతంగా జరగడానికి దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పురానీహవేలిలోని పాత పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్‌తో పాటు రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లతో పాటు జీహెచ్‌ఎంసీ, విద్యుత్, జలమండలి, ట్రాఫిక్, ఆర్టీసీ, ఆర్ అండ్ బీ తదితర విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. వినాయక నిమజ్జనోత్సవంతో పాటు మిలాద్-ఉన్-నబీ వేడుకలు కూడా ఈ నెల 28న ఉండటంతో ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రజలకు ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు స్పందించాలని కోఆర్డినేషన్ సమావేశం తీర్మానించింది. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా సంబంధిత పోలీస్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలు రౌండ్ ది క్లాక్ విధి నిర్వహణలో ఉండాలన్నారు. రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్.రూపేశ్, సౌత్, వెస్ట్ జోన్ డీసీపీ కారే కిరణ్ పాల్గొన్నారు.

కార్వాన్ నుంచి బీజేపీ నేతల పోటాపోటీ



అమర్‌సింగ్



డిజ్వర్‌సింగ్



దేవర శ్రీనివాస్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి బీజేపీ నాయకులు ముందుకు వస్తున్నారు. సీనియర్ నాయకులతో పాటు బీజేపీ యువ నాయకులు సైతం పోటీకి సై అంటున్నారు. ఇప్పటి వరకు కార్వాన్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా తమకు అవకాశం ఇవ్వాలంటూ పార్టీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకున్నారు. తలపండిన నాయకులతో పాటు బీజేవైఎం యువ నాయకులు సైతం తామే గెలుస్తామంటూ పార్టీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సీనియర్ నాయకుడు టి.అమర్‌సింగ్ గతంలోనే కార్వాన్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. భారీ అనుచర ఘణంతో పాటు అన్ని వర్గాల ప్రజల మద్దతు తనకే ఉందని ఈసారి అవకాశం ఇస్తే తానే గెలుస్తానంటూ ఆయన టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కార్వాన్ డివిజన్ నుంచి బీజేపీ తరఫున బీజేపీ కార్పొరేటర్‌గా పోటీ చేసిన కట్ల అశోక్ సైతం దరఖాస్తు సమర్పించుకున్నారు. అదే విధంగా సీనియర్ నాయకుడు డిజ్వర్‌సింగ్, గూడబోయిన శివరత్నం, బి.దర్శన్, దేవర శ్రీనివాస్ తదితరులు సైతం దరఖాస్తు చేసుకున్నారు. ఏదేమైనా టికెట్ తమకే వస్తుందని సీనియర్లు ధీమాతో ఉండగా ఈసారి యువకులకే పార్టీ అవకాశం ఇస్తుందన్న ధీమాతో యువ నాయకులు ఆశాభావంతో ఉన్నారు.